సాక్షి

సిద్దిపేట

ఆదివారం । 17 । నవంబర్ । 2024





సుఖ దుఃఖాల సోపతి!

కనుమరుగవుతున్న తోలు డప్పులు

- ఒకప్పుడు రాజ్యమేలిన వాయిద్యం
- ఏ కార్యక్రమమైనా చాటింపు ఉండాల్సిందే
- వాటి స్థానంలో ప్లాస్టిక్ డప్పులు
- పెరిగిన డీజే మైక్ సెట్‌లు
- కళను బతికించుకోవాలంటున్న డప్పు కళాకారులు
- ప్రభుత్వం ఆదుకోవాలని వినతి

సండే స్పెషల్

డప్పు దరువు వింటే చాలు ఉద్యమాన్ని ఉరకలెత్తించే గుండె చప్పుడవుతుంది. కళాకారుల ఆట పాటలకు అడుగులవుతుంది. పండుగ పబ్బాల్లో ఉత్సాహాన్నిస్తూ చిందులేసేలా చేస్తుంది. బోనాల ఊరేగింపులో ముందు నడుస్తూ, శివసత్తుల శిగాలతో ఉగ్ర రూపాన్ని తెప్పిస్తుంది. పోతరాజులను కదం తొక్కిస్తుంది. స్వామి వారు లేదా అమ్మవారి శోభాయాత్రలో ఉత్సాహంతో మార్మోగుతుంది. శవ అంతిమ యాత్రలో విషాద నాదపు చప్పుడు వినిపిస్తూ కంట తడిపెట్టిస్తుంది. చాటింపుతో అసలు విషయాన్ని చెవిన పడేస్తుంది. పెళ్లయినా, చావైనా రేవయినా, కష్టాలొచ్చినా, కన్నీళ్లొచ్చినా, ఉత్సాహమొచ్చినా, ఉద్వేగమొచ్చినా.. ఇలా, సుఖ దుఃఖాలలో ప్రతి మనిషికి డప్పుతో అవినాభావ సంబంధాన్ని చాటి చెబుతుంది. అలాంటి డప్పు నేడు ఎక్కడా వినిపించడం లేదు. డీజేల హోరులో డప్పు చప్పుళ్లు పల్లెల్లో కనుమరుగైపోతున్న నేపథ్యంలో 'సాక్షి'ప్రత్యేక కథనం.

- వేముల బాలరాజు, మిరుదొడ్డి (దుబ్బాక)

8లో





భరతనాట్యం చేస్తున్న యువతి





హరిద్రకు హారతి

నాచగిరి పుణ్యక్షేత్రం.. హరిద్రనది తీరంలో గంగమ్మ తల్లికి కుంభ హారతి ఇచ్చారు. మహిళలు, భరతనాట్య బృందం కూడా హారతి పట్టింది. దీపాలు వెలిగించి నదిలో వదిలారు. నేత్రపర్వంగా సాగిన కార్తీక దీపోత్సవ వేడుకలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఉదయం క్షేత్రంలో భారీగా సత్యనారాయణ వ్రతాలు జరిగాయి. -వర్గల్(గజ్వేల్)

న్యూస్‌రీల్

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ చీఫ్ కోఆర్డినేటర్‌గా నరసింహచారి



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ చీఫ్ కోఆర్డినేటర్‌గా సిద్దిపేట ప్రాంతానికి చెందిన బండోజు నరసింహచారిని నియమించినట్లు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ చింతపట్ల వెంకటచారి శనివారం తెలిపారు. స్కూల్ అసిస్టెంట్ హిందీగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నారాయణరావుపేటలో విధులు నిర్వహిస్తున్న బండోజు నరసింహచారి, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ చీఫ్ కో ఆర్డినేటర్‌గా నియామక అవ్వడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. సంగీత, సాహిత్యం, నృత్యం, క్రీడలు, యోగా తదితర రంగాలలో రాణించిన వారికి తెలుగు బుక్ ఆఫ్ రికార్డు అందించనున్నట్లు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్క రాములు



మాట్లాడుతున్న రాములు

చేర్యాల(సిద్దిపేట): ప్రజా సమస్యల పరిష్కారం, పాలకులు ఇచ్చిన హామీల అమలు కోసం రాబోయే రోజుల్లో బలమైన ప్రజా ఉద్యమాలు చేస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్క రాములు అన్నారు. శనివారం స్థానిక ఈడెన్ గార్డెన్‌లో 8వ మండల మహాసభలు గొర్రె శ్రీనివాస్, రేపాక కుమార్, గోగురు చంద్రకళ అధ్యక్షతన జరిగాయి. ఈ మహాసభలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా వైఫల్యం చెందాయన్నారు. ప్రజావ్యతిరేక విధానాల అవలంబిస్తూ సమస్యలు పట్టించుకోని ప్రభుత్వాలపై రాబోయే రోజుల్లో బలమైన పోరాటాలు చేస్తామన్నారు.

వ్యాయామం జీవితంలో భాగం కావాలి

ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్



పరేడ్‌ను పరిశీలిస్తున్న అడిషనల్ డీసీపీ

చిన్నకోడూరు(సిద్దిపేట): సంపూర్ణ ఆరోగ్యంతో ఏదైనా సాధించవచ్చని ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్ అన్నారు. శనివారం మండలంలోని పెద్దకోడూరు శివారు సీఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో సివిల్, రిజర్వ్ పోలీస్, హోంగార్డ్‌లకు పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పోలీస్ సిబ్బంది క్రమం తప్పకుండా వాకింగ్, రన్నింగ్, యోగా వంటివి చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. వ్యాయామాన్ని జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. అప్పుడే ఎలాంటి అనారోగ్యానికి గురికారన్నారు. తద్వారా విధులు సక్రమంగా నిర్వహించడానికి అవకాశం ఉంటుందన్నారు.

20 నుంచి నిరవధిక సమ్మె

టీబీఎస్ఆర్‌కేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఇతర రాష్ట్రాల వలస కార్మికుల మూలంగా తెలంగాణ భవన నిర్మాణ రంగాల కార్మికులకు ఉపాధి కరువైందని తెలంగాణ భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం (టీబీఎస్ఆర్‌కేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం అన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని టీబీఎస్ఆర్‌కేఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వలస కార్మికులను వారి స్వరాష్ట్రాలకు పంపించి తెలంగాణ కార్మికులకు పని కల్పించాలనే డిమాండ్‌తో ఈ నెల 20 నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు తెలిపారు.

సన్నాలకు స్పందనేది?

- బహిరంగ మార్కెట్ ఎఫెక్ట్
- తేమను పరిశీలించకుండా కొంటున్న వ్యాపారులు
- మొగ్గు చూపుతున్న రైతులు
- అధికారుల అంచనాలు తారుమారు
- జిల్లాలో సన్నాల కేంద్రాలు 66

ఇప్పటి వరకు 23 టన్నులే కొనుగోళ్లు



సిద్దిపేట మార్కెట్ యార్డు వద్ద వడ్ల లోడు దింపుతున్న కూలీలు

బహిరంగ మార్కెట్‌లో సన్నాలకు మంచి డిమాండ్ ఉండటంతో కొనుగోలు కేంద్రాల వైపు రైతులు కన్నెత్తి చూడటం లేదు. సన్నాలకు బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినా రైతుల నుంచి స్పందన కరువైంది. సన్న ధాన్యం 23 టన్నులు మాత్రమే కొనుగోలు కేంద్రాల్లో కొన్నారు. దొడ్డు ధాన్యం మాత్రమే కేంద్రాలకు తీసుకువస్తున్నారు.

సాక్షి, సిద్దిపేట: జిల్లా వ్యాప్తంగా వానాకాలంలో వరి 3,68,173 ఎకరాలు సాగు చేయగా, సన్న రకాలు 65,993 ఎకరాల్లో సాగు చేశారు. మొత్తంగా 9 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. 4 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 3.25 లక్షల టన్నులు దొడ్డు కాగా 75 వేల టన్నుల సన్నాలు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 40 రోజులు కావస్తోంది. ఇద్దరు రైతులు మాత్రమే 23 టన్నుల ధాన్యంను కొనుగోలు కేంద్రాల్లో విక్రయించారు. హుస్నాబాద్, తిమ్మాపూర్‌ల నుంచి కేవలం ఇద్దరు రైతులే తీసుకొచ్చారు. దొడ్డు ధాన్యంను 13,088 మంది రైతుల దగ్గరి నుంచి 64,349 టన్నులను నిర్వాహకులు కొనుగోలు చేశారు.

అంచనాలు తూచ్

33 రకాల సన్న ధాన్యం క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. దీంతో సన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తాయని అధికారులు భావించారు. కానీ వారి అంచనాలు తలకిందులయ్యాయి సన్నాల కోసం 66 చోట్ల కేంద్రాలు ప్రారంభించినా వడ్లు రావడం లేదు. సన్నాలుగా గుర్తించేందుకు ప్రభుత్వం పరికరాలను సైతం అందించారు. సన్నాలకు బహిరంగ మార్కెట్‌లో డిమాండ్ ఎక్కువగా ఉంది. బియ్యానికి రూ.5 వేల నుంచి 6వేల వరకు రేటు పలుకుతోంది. పలువురు మరాడించి అమ్మాలని భావిస్తున్నారు. మరికొందరు కల్లాల వద్దే ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ప్రైవేట్ వ్యాపారులు తేమను పరిశీలించకుండానే కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఆరబెట్టే బాధ తప్పుతోంది. దీంతో ప్రైవేట్ వ్యాపారుల వైపే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా 417 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు.

తెచ్చినవే కొన్నాం



కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యంను కొనుగోలు చేస్తున్నాం. రైతులకు 48 గంటల లోపే ధాన్యం డబ్బులను బ్యాంక్ అకౌంట్‌లలో జమ చేస్తున్నాం. ఇప్పటి వరకు 23 టన్నుల సన్న ధాన్యంను కొనుగోలు చేశాం. ఇంకా వర్గల్, ములుగు, జగదేవ్‌పూర్‌ల నుంచి ఎక్కువ మొత్తంలో సన్న ధాన్యం వస్తాయని అంచనా వేస్తున్నాం.

-ప్రవీణ్, డీఎం

నేడే గ్రూప్–3 పరీక్ష

రేపు కూడా కొనసాగింపు

- పట్టణంలో 37 కేంద్రాలు
- హాజరు కానున్న 13,401 మంది అభ్యర్థులు
- అరగంట ముందే గేట్లు మూసివేత
- నిమిషం ఆలస్యమైనా అనుమతించరు



బెంచీలపై హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

సిద్దిపేటరూరల్: గ్రూప్ 3 పరీక్షకు జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధమైంది. ఆది, సోమవారాల్లో ఎగ్జామ్స్ నిర్వహిస్తోంది. తొలిరోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. రెండోరోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నారు. పట్టణంలోని 37 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయి. 13,401 మంది అభ్యర్థులు రెండు రోజుల పాటు హాజరుకానున్నారు. పరీక్షల నిర్వహణకు 37 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 37 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 10 మంది రూట్ అధికారులు, ఐదుగురు ఫ్లైయింగ్ స్క్వాడ్ ఆఫీసర్లు పరీక్షలను పరిశీలించనున్నారు. పరీక్ష సమయానికి అరగంట ముందే ప్రవేశ ద్వారాలను మూసి వేయనున్నారు. ఒక్క నిమిషం ఆలస్యమైన లోపలికి అనుమతి లేదు. పరీక్ష కేంద్రానికి 500ల మీటర్ల వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. 381 మంది పోలీసు అధికారులు, పోలీసులతో పటిష్టమైన బందోబస్తు చర్యలను పోలీసు యంత్రాంగం చేపట్టింది.

అభ్యర్థులకు సూచనలు

గ్రూప్ 3 పరీక్ష రాసే అభ్యర్థులను రెండు దశల్లో తనిఖీ చేస్తారు. హాల్‌టికెట్‌లో ఫొటో సరిగ్గా లేని క్రమంలో 3 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలను గెజిటెడ్ అధికారి, చివరగా చదివిన విద్యాసంస్థ ప్రిన్సిపాల్ సంతకంతో తీసుకువచ్చి పరీక్ష కేంద్రంలోని ఇన్విజిలేటర్‌కు అప్పగించాలి. హాల్‌టికెట్‌తో పాటుగా ప్రభుత్వం అందించిన గుర్తింపు కార్డును వెంట తీసుకురావాలి. మహిళా అభ్యర్థుల కోసం ప్రత్యేక తనిఖీ ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రంలోకి అభ్యర్థులు ఎలాంటి స్మార్ట్ వాచ్‌లు, పుస్తకాలు, సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురావద్దు. బయోమెట్రిక్ విధానంలో తనిఖీ చేయనున్న క్రమంలో అభ్యర్థులు చేతులపై ఎలాంటి టాటూలు, మెహందీ వంటి వేసుకోవద్దు.

మార్చి తర్వాతే మోపెడ్‌లు



గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచాలను పంపిణీ చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

- కాటమయ్య కవచాలు కుటుంబాలకు రక్షణ
- మంత్రి పొన్నం ప్రభాకర్
- గీత కార్మికులకు కిట్ల పంపిణీ

హుస్నాబాద్: కాటమయ్య రక్షణ కవచాలపై ఐఐటీ ఇంజినీర్లు పరిశోధన చేశారని, కాటమయ్య రక్షణ కవచాలు గీత కార్మిక కుటుంబాలకు రక్షణగా నిలుస్తాయని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం స్థానిక తిరుమల గార్డెన్‌లో గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచాలను మంత్రి తన చేతుల మీదుగా పంపిణీ చేశారు. రక్షణ కవచాల పని తీరుపై ట్రైనర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాటి చెట్ల నుంచి పడి ప్రమాదవశాత్తు గీత కార్మికులు చనిపోతున్నారన్నారు. వారి రక్షణ కోసం ఈ కిట్లను తయారు చేశామన్నారు. ప్రతీకార్మికుడికి ఈ కిట్‌ను అందజేస్తామని, క్షేత్రస్థాయిలో శిక్షణ ఇచ్చే విషయంలో ఎక్కడ జాప్యం జరగకూడదన్నారు. ప్రభుత్వంతో పాటు ఎమ్మెల్యే, ఎంపీ నిధులు కూడా వెచ్చించి కాటమయ్య రక్షణ కవచాలు పంపిణీ చేస్తామన్నారు. వృత్తిలో ఉన్నవారిని రక్షించుకోవడంతో పాటు భవిష్యత్‌లో పిల్లలను ఉన్నత చదువులు చదివించి ఉన్నత శిఖరాలు పొందేలా కష్టపడాలన్నారు. తాటి చెట్టు ఎత్తు తక్కువగా ఉండేలా శాస్త్రీయ పరిశోధనలు జరుగుతున్నాయని తెలిపారు. 50 శాతం చెట్లు తాటి, ఈత మొక్కలను నాటాలన్నారు. ప్రతీఒక్కరు 10 మొక్కలు నాటాలని, కాలువలు, గట్లపైన ప్రభుత్వ స్థలాల్లో తాటి, ఈత వనాలను పెంచాలన్నారు. తాటి వనాల్లో నీటి సౌకర్యం కోసం బోర్లు వేయిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. గీత కార్మికులకు ఎక్స్‌గ్రేషియా, పాత బకాయిలు విడుదల అయ్యేలా కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ ఖజానా ఖాళీగా ఉందని, మార్చి తర్వాత గీత కార్మికులకు మోపెడ్‌లు ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ రామ్మూర్తి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలకు ఎంపిక

మిరుదొడ్డి(దుబ్బాక): రాష్ట్రస్థాయి వాలీబాల్ క్రీడలకు విద్యార్థిని ఎంపికై ంది. శనివారం గజ్వేల్ గర్ల్స్ ఎడ్యుకేషన్ హబ్‌లో జరిగిన జిల్లా స్థాయి వాలీబాల్ అండర్ 19లో మిరుదొడ్డి మోడల్ స్కూల్, కళాశాల ఇంటర్ విద్యార్థి పి. ప్రవళిక ప్రతిభ కనబరిచింది. ఆ మేరకు విద్యార్థిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడంపై స్కూల్, కళాశాల ప్రిన్సిపాల్ అర్చన అభిందించారు.

గ్రామాల అభివృద్ధిలో నిర్లక్ష్యం వద్దు

జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి

హుస్నాబాద్‌రూరల్: గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యం చేయవద్దని, ప్రజల సమస్యలను అక్కడే పరిష్కరించాలని జిల్లా పంచాయతీ అధికారిని దేవకీదేవి అన్నారు. శనివారం హుస్నాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో అక్కన్నపేట, హుస్నాబాద్ పంచాయతీ కార్యదర్శులతో కలిసి ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో సర్పంచ్‌ల పాలన ముగిసినందునా గ్రామాల్లో తాగునీరు సరఫరా, పారిశుద్ధ్యం, వీధి దీపాల సమస్యలు ప్రజలకు రాకుండా చూడాలని చెప్పారు. పంచాయతీ రికార్డులను అప్పటికప్పుడు సరిచూసుకోవాలన్నారు.

సర్వేకు సహకరించాలి

నంగునూరు(సిద్దిపేట): సర్వే కోసం ఇంటికి వచ్చే ఎన్యూమరేటర్లకు సహకరించి పూర్తి సమాచారం అందజేయాలని డీపీఓ దేవకీదేవి ప్రజలకు సూచించారు. వెంకటాపూర్‌లో నిర్వహిస్తున్న సమగ్ర సర్వేను శనివారం ఆమె తనిఖీ చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్వే నంగునూరు మండలంలో విజయవంతంగా కొనసాగుతోందన్నారు.

మార్కెటింగ్ ఇక సులభం

ఆయిల్‌పామ్ మార్కెటింగ్ ఇక సులభతరం కానుంది. మే నెలలో నర్మెట ఫ్యాక్టరీలో క్రషింగ్ ప్రారంభం కాబోతోంది. ఈ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా కలెక్షన్ సెంటర్ల ఏర్పాటుకు ఆయిల్‌ఫెడ్ సంస్థ కార్యాచరణ ప్రారంభించింది. ఇప్పటికే మర్కూక్, దౌల్తాబాద్, బెజ్జంకి మండల కేంద్రాల్లో ఈ కలెక్షన్ సెంటర్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వ నూనె గింజల విభాగం జాయింట్ సెక్రటరీ పర్యటన నేపథ్యంలో సాగు అభివృద్ధికి దోహదపడనుంది.

- మర్కూక్, దౌల్తాబాద్, బెజ్జంకిలలో ఆయిల్‌పామ్ కలెక్షన్ సెంటర్లు
- 50 కి.మీ దూరంలోపే కేంద్రాలు
- వచ్చే ఏడాది నుంచి క్రషింగ్
- జిల్లాలో కేంద్ర ప్రభుత్వ ఆయిల్‌ఫెడ్ జాయింట్ సెక్రటరీ పర్యటన



గౌరారంలో ఆయిల్‌పామ్ రైతుతో మాట్లాడుతున్న అజిత్‌కుమార్, చిత్రంలో కలెక్టర్ మనుచౌదరి

గజ్వేల్: జిల్లాలో ఆయిల్‌పామ్ రైతులకు ఇక మంచి రోజులు రాబోతున్నాయి. జిల్లాలో ప్రస్తుతం 12 వేల ఎకరాల్లో సాగులోకి వచ్చింది. ఖమ్మం తర్వాత ఈ తోటల సాగులో జిల్లా రెండోస్థానంలో నిలిచింది. మాజీ మంత్రి హరీశ్‌రావు కృషి ఫలితంగా ఈ అరుదైన రికార్డు సాధ్యమైంది. ఈ జిల్లాలో మార్కెటింగ్ సౌకర్యాల కల్పనపై అధికార యంత్రాంగం దృష్టి పెట్టింది. జిల్లాలోని నర్మెటలో రూ.300 కోట్లతో ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీని నిర్మించిన సంగతి తెలిసిందే. వచ్చే ఏడాది మే నెల వరకు ఇక్కడ క్రషింగ్‌ను ప్రారంభించి జిల్లా రైతులకు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుతం అశ్వరావుపేటలోని ఫ్యాక్టరీకి ఉత్పత్తులను తరలిస్తున్నారు.

మొక్కల నాణ్యత పరిశీలన

జిల్లాలోని ఆయిల్ పామ్ ఉత్పత్తి చేస్తున్న రైతులకు 50 కిలోమీటర్లలోపే కలెక్షన్ సెంటర్లను అందుబాటులోకి తేవడానికి ఆయిల్‌ఫెడ్ సంస్థ నిర్ణయించింది. మొదటి దశలో మర్కూక్, దౌల్తాబాద్, బెజ్జంకి మండల కేంద్రాల్లో కలెక్షన్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నారు. మరికొన్ని కేంద్రాలను ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. రైతులు తమ ఉత్పత్తులను నేరుగా కలెక్షన్ సెంటర్ల వద్ద అమ్ముకోవచ్చు. శనివారం కలెక్టర్ మనుచౌదరితో కలిసి కేంద్ర ప్రభుత్వ నూనె గింజల విభాగం జాయింట్ సెక్రటరీ అజీత్‌కుమార్ సాహో జిల్లాలోని ములుగు, వర్గల్ మండలాల్లో పర్యటించారు. కాగా, జిల్లాలో ఆయిల్‌పామ్ సాగును అభివృద్ధి చేసుకోవడానికి, మార్కెటింగ్ సౌకర్యాలను మెరుగుపరుచుకోవడానికి అవసరమైన ప్రతిపాదనలకు వేగంగా ఆమోదం లభించే అవకాశం కలిగింది. అలాగే జిల్లాలో ఆయిల్‌ఫామ్ కలెక్షన్ సెంటర్ల ఏర్పాటు అంశాన్ని జిల్లా ఉద్యానవనశాఖాధికారి సువర్ణ ధ్రువీకరించారు.

భవిష్యత్‌లో ఆయిల్‌పామ్‌కు మరింత డిమాండ్

వర్గల్(గజ్వేల్): ఆయిల్‌పామ్ సాగు ద్వారా రైతులు గణనీయ లాభాలు గడించవచ్చని, భవిష్యత్‌లో ఈ పంటకు మరింత డిమాండ్ పెరుగుతుందని కేంద్ర ప్రభుత్వ ఆయిల్‌ఫెడ్ విభాగం జాయింట్ సెక్రటరీ అజీత్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం కలెక్టర్ మను చౌదరి, రాష్ట ఉద్యానశాఖ జాయింట్ డైరెక్టర్ సరోజినిదేవి, ఆయిల్‌ఫెడ్ మేనేజర్ సుధాకర్‌లతో కలిసి ఆయన మండలంలోని గౌరారం, శాకారం సందర్శించారు. అక్కడ రైతులు సాగు చేసిన తోటలను పరిశీలించారు.

నాణ్యమైన మొక్కలను అందజేయాలి

ములుగు(గజ్వేల్): మండల కేంద్రంలోని ఆయిల్‌పామ్ నర్సరీని శుక్రవారం కలెక్టర్ మనుచౌదరితో కలిసి కేంద్ర ప్రభుత్వ నూనె గింజల విభాగం సంయుక్త కార్యదర్శి అజిత్ కుమార్ సందర్శించారు. నర్సరీలో పెంచుతున్న ఆయిల్‌పామ్ మొక్కల నాణ్యతను అలాగే పాటించవలసిన యాజమాన్య పద్ధతుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన ఆయిల్‌పామ్ మొక్కలను రైతులకు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే గుణాత్మక విద్య

జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి

దుబ్బాకటౌన్: ప్రభుత్వ పాఠశాలల్లోనే గుణాత్మక విద్య అందుతోందని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలని అన్నారు. శనివారం దుబ్బాక మండలం ఆకారం, లచ్చపేటలో ప్రాథమిక, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల బోధనను పరిశీలించారు. విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించాలని, చిత్రలేఖన, రాత నైపుణ్యాలను పెంపొందించాలని ఆదేశించారు. వారిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లేలా బోధన అందించాలని సూచించారు. నైపుణ్యాన్ని వెలికితీయాలని పేర్కొన్నారు. వచ్చేనెల 4న నిర్వహించే నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేకు 3, 6, 9వ తరగతి విద్యార్థులను సంసిద్ధం చేయాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ప్రభుదాస్, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా

అండర్-19కు గీతం విద్యార్థి ఎంపిక

ధనుష్ ప్రతిభపై ప్రశంసలు


విద్యార్థి ధనుష్

పటాన్‌చెరు: గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, బీటెక్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి దేవి ధనుష్ కూచ్ బెహార్ ట్రోఫీ 2024-25 సీజన్ అండర్-19 ఆంధ్ర రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడు. దేవి ధనుష్, ప్రతిభావంతుడైన కుడి చేతివాటం బ్యాట్స్‌మన్. దాదాపు తొమ్మిదేళ్లుగా తన క్రికెట్ నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటూ, ప్రస్తుతం హైదరాబాద్‌లోని ప్రఖ్యాత ఎం.ఎస్.కే. ప్రసాద్ అంతర్జాతీయ క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందుతున్నాడు. ధనుష్ అంకితభావం, కృషి ఫలించి, రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఇటీవలి అండర్-19 జిల్లా మ్యాచ్‌లలో అసాధారణమైన ప్రతిభను కనబరిచి, కృష్ణాజిల్లా తరపున అత్యధిక పరుగులు చేశాడు. గీతం విశ్వవిద్యాలయం నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ గస్టో-2023-24లో ఉత్తమ బ్యాట్స్ మెన్ అవార్డును పొందాడు. అండర్-14 రాష్ట్ర స్థాయి ప్రాబబుల్స్‌లో ఆకట్టుకునే ప్రదర్శన చేసి, అండర్-16 జోనల్ మ్యాచ్‌లకు చేరుకోవడం, క్రీడలో ధనుష్ సామర్థ్యాన్ని మరింత పెంచింది. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు ప్రశంసించింది. గీతం హైదరాబాద్ అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ తదితరులు, ధనుష్ మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షించారు.

ట్రిపుల్ ఐటీలో ఆత్మహత్యలను నివారించలేరా..?

ఏబీవీపీ నేత పృథ్వీ

చేగుంట(తూప్రాన్): ప్రభుత్వాలు మారుతున్నా బాసర ట్రిపుల్ ఐటీలో ఆత్మహత్యలు నివారించలేక పోతున్నాయని ఏబీవీపీ ఉస్మానియా యూనివర్సిటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పృథ్వీ అన్నారు. శనివారం బాసరకు రైలులో వెళుతున్న ఏబీవీపీ రాష్ట్ర నాయకులను పోలీసులు వడియారం రైల్వే స్టేషన్‌లో అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా పృథ్వీ విలేకరులతో మాట్లాడుతూ ఏడాది కాలంలో 9మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. ప్రభుత్వాలు మారినా విద్యార్థుల ఆత్మహత్యలు నివారించడంలో విఫలమైనట్లు తెలిపారు. ఇటీవల బాసర ట్రిపుల్ ఐటీకి వెళ్లిన నిర్మల్ ఏబీవీపీ కార్యదర్శి సాయిని తలపై గాయపర్చిన సిబ్బందిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. పోలీసులు ముందస్తు అరెస్టు చేసిన వారిలో రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి విష్ణువర్దన్, చేగుంట పట్టణ అధ్యక్షుడు వంశీ ఉన్నారు.

ముగ్గురు బైండోవర్

కోహెడరూరల్(హుస్నాబాద్): దుర్గామాత నవరాత్రి ఉత్సవాలలో అనుమతి లేకుండా డీజేలు పెట్టిన శనిగరానికి చెందిన రమేష్, రాజు అనిల్‌లను ఎస్ఐ అభిలాష్, తహసీల్దార్ సురేఖ ఎదుట ఆదివానం బైండోవర్ చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ ఈ ముగ్గురు అధికారుల ఉత్తర్వులు దిక్కరించి డీజేలు పెట్టి ప్రజలను ఇబ్బంది పెట్టారన్నారు. వారిపై కేసు నమోదుచేసి బైండోవర్ చేయగా తహసీల్దార్ ఒక్కొక్కరికి రూ.6వేలు జరిమానా విధించారని చెప్పారు.

సుఖ దుఃఖాల సోపతి!

కనుమరుగవుతున్న తోలు దప్పులు

- ఒకప్పుడు రాజ్యమేలిన వాయిద్యం
- ఏ కార్యక్రమమైనా చాటింపు ఉండాల్సిందే
- వాటి స్థానంలో నేడు ప్లాస్టిక్ డప్పులు
- పెరిగిన డీజే మైక్ సెట్‌లు
- ఉపాధి కోల్పోతున్న కులవృత్తి వారు
- కళను బతికించుకోవాలంటున్న డప్పు కళాకారులు
- ప్రభుత్వం ఆదుకోవాలని వినతి



దప్పులు కొడుతున్న యువకులు

పాశ్చాత్య సాంస్కృతికి ప్రతి ఒక్కరూ అలవాటు పడుతున్న ప్రస్తుత తరుణంలో జంతువుల తోలు చర్మంతో తయారు చేసిన దప్పులు కానరాకుండా పోయాయి. వాటి స్థానంలో ప్లాస్టిక్ దప్పులు వచ్చి చేరుతున్నాయి. దీంతో సహజ శబ్దాలను పలికే చర్మాలతో తయారు చేసే వారు సైతం కనుమరుగైపోతున్నారు. నాడు గ్రామాల్లో సందర్భాన్ని బట్టి కొట్టే దప్పు శబ్దాలు పలానా పండుగనీ, పెండ్లి తంతనీ, లేదా అంతిమ యాత్ర అని జనాలు గుర్తు పెట్టుకునే వారు. ప్రస్తుతం ప్లాస్టిక్‌తో చేసిన దప్పులు రంగప్రవేశం చేయడంతో తోలు దప్పుల ద్వారా వచ్చే లయబద్ధమైన శబ్దాలు వినిపించడం లేదని దప్పు కళాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మిరుదొడ్డి(దుబ్బాక):

కనుమరుగవుతున్న లందలు

దప్పుల తయారీలో కీలకంగా మారే లందలు (ప్రత్యేకమైన గోళాలు) క్రమంగా కనుమరుగవుతున్నాయి. ఈ లందల్లో జంతు చర్మాలను నానబెట్టి చర్మాలకు ఉన్న వెంట్రుకలను తొలగించడం కీలకంగా మారుతుంది. లందలు ఇప్పటికీ కొన్ని గ్రామాల్లో అక్కడక్కడ దర్శనమిస్తున్నాయి. ఆయా గ్రామాల్లో ఉన్న అన్ని కుల వర్గాల ప్రజలు తమ ఇళ్లల్లో కుల దేవతలను ప్రతిష్ఠించడానికి ముందుగా లందలకు ప్రత్యేక పూజలు చేయడం విశేషం.



సౌతాఫ్రికా స్టేజీపై దప్పు కళాకారులు



దప్పు తయారీ కోసం జంతు చర్మాలను నానబెట్టే లంద (ప్రత్యేకమైన గోళెం)

ప్రపంచానికి చాటిన 'అందె'దరువు

మారుమూల పల్లెల్లో ఆదరణ లేక మూగబోయిన దప్పు దరువును అందె మ్యూజిక్ అకాడమీ సంస్థ దప్పు ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెబుతోంది. అకాడమీ వ్యవస్థాపక చైర్మన్ అందె భాస్కర్ తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు మూడు వేల మందికి శిక్షణ ఇచ్చి దప్పు కళాకారులను తయారు చేశారు. దేశ స్వాతంత్ర్య చరిత్రలో గత జనవరి 26న మొదటి సారిగా భారత రిపబ్లిక్ పరేడ్‌కు దప్పుకు ఆహ్వానం లభించింది. సౌత్ ఆఫ్రికాతోపాటు ఇటీవల మలేషియాలో సైతం డప్పుల మోత మోగించి ప్రపంచానికి చాటి చెప్పారు. డప్పు దరువు పై పరిశోధన చేసి డప్పు ధ్వని విలువను ప్రపంచానికి పరిచయం చేసిన అకాడమీ చైర్మన్ అందె భాస్కర్‌కు భారత సంగీత నాటక అకాడమీ, మినిస్ట్రీ కల్చర్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండియా వారు ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ యువ పురస్కారాన్ని అందించారు. యువ పురస్కారం అందుకున్న అందె భాస్కర్‌ను ఇటీవల తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా సన్మానించి సత్కరించడం విశేషం.

దప్పుల తయారీ ఇలా..

దప్పులు కొట్టడం మాదిగల కుల వృత్తి. వీరు దప్పులు తయారు చేయడంలో కూడా నేర్పరులు. వీరు లేత మేకలు, గొర్రెలు, వయస్సు తక్కువ ఉన్న దూడల నుంచి లభించే లేత చర్మాలతో దప్పులను తయారు చేస్తారు. చలి కాలంలో తోలు దప్పులు ముడుచుకు పోవడంతో శబ్దం పలకడం కష్టతరంగా మారుతోంది. ఇలాంటి సమయంలో దప్పు వాయిద్యకారులు దప్పులను సన్నని సెగపై కాపడం వల్ల దప్పులు కంచు మోగినట్లు మోగుతాయి. దప్పులను తయారు చేసిన వారికి, వాటిని వినియోగించిన వారికి ఉపాధి లభిస్తుండేది.


తోలు డప్పులను కాపుతున్న యువకులు

డీజేల సౌండ్‌లతో..

డీజేల సౌండ్ రాకతో దప్పుల చప్పుడు మూగబోయాయి. వినాయక చవితి, దుర్గామాతల శోభా యాత్రలు, రాజకీయ నాయకుల విజయ యాత్రల్లో కీలకంగా మారిన దప్పులు ఇప్పుడు డీజేల సౌండ్ల రాకతో కనిపించకుండా పోయాయి. డీజే రణగొణ ధ్వనుల మధ్య చిన్నారుల నుంచి పెద్దల వరకు నృత్యాలు చేస్తూ సందడి చేసే పరిస్థితులు నెలకొన్నాయి.


ఢిల్లీలో దప్పు ప్రదర్శనలు

చర్మాలతో తయారు చేసేవాడిని



గొర్రెలు, మేకల చర్మం కంటే లేత దూడల చర్మం (తోలు)తో చేసిన దప్పులు బాగా మోగేవి. ఏదో కారణంగా చనిపోయిన లేత దూడల చర్మాలను తీసుకొచ్చి దప్పును తయారు చేసెటోన్ని. దప్పులు తయారు చేసినందుకు నాకు ఇంత గిట్టు బాటు దొరికేది. ఇప్పుడు తోలు దప్పులు కానరాకుండా పోయినయ్. వాటి స్థానంలో ప్లాస్టిక్ దప్పులు వచ్చాయి. తోలు దప్పులను తయారు చేసే వారు కూడా మా తరంతోనే పోయేటట్టుంది.

– మల్లయ్య, మిరుదొడ్డి

దప్పును వాయిస్తాను



ఒకప్పుడు కేవలం మగవారే దప్పులు వాయించే వారు. నేను సైతం దప్పును వాయిస్తాను. దప్పు మీద ఉన్న మమకారంతో నాతోపాటు చాలా మంది మహిళలు దప్పు వాయిద్యాన్ని నేర్చుకున్నారు. ఢిల్లీ ఎర్రకోటలోనే కాకుండా సౌతాఫ్రికా ఖండంలో కూడా దప్పు దరువును మోగించాం. పల్లెల్లో చిన్నబోయిన దప్పు వాయిద్యాన్ని ఖండాంతరాలు దాటించడంలో నా వంతు కృషి చేయడం ఆనందంగా ఉంది.

– దివ్య, దప్పు కళాకారిణి, సిద్దిపేట

ఉపాధి కరువైంది



మా తాత ముత్తాలు దప్పులు కొడుతుండేవారు. వారితోపాటు నేను కూడా దప్పులు బాగా కొడతాను. నాడు రాజకీయ సభలకు, దేవీ దేవతల కల్యాణ మహోత్సవాలతోపాటు, ఎక్కడైనా పెండ్లీలు జరిగితే వారం రోజుల పాటు ఉపాధి లభించేది. ఇప్పుడు డీజేలు, బ్యాండ్ మేళాలు రావడంతో దప్పులకు ఆదరణ తగ్గి పోయింది. దీంతో మాకు ఉపాధి లేకుండా పోయింది.

– భూమరాజయ్య, మిరుదొడ్డి

కళాకారులను ఆదుకోవాలి



ఒక నాడు పల్లెల్లో దప్పులు వాయిస్తూ ఉపాధి పొందే వారు ఇప్పుడు ఆదరణ లేక దప్పుల శబ్దాలు వినిపించడం లేదు. దీంతో దప్పులను తయారు చేసే వారు కూడా కనుమరుగవుతున్నారు. దప్పు కళాకారులను తెలంగాణ ప్రభుత్వం గుర్తించి పింఛన్ లాంటి సౌర్యం కల్పించాలి. స్వయం ఉపాధి కలిగించేలా ప్రభుత్వం పాటు పడాలని కోరుతూ రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విన్నవించాం.

– అందె భాస్కర్, మిరుదొడ్డి

దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా..

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి
- మరో ఇద్దరికి గాయాలు
- మృతులు హైదరాబాద్ వాసులు


ప్రమాదానికి గురైన కారు

జహీరాబాద్ టౌన్: దైవ దర్శనానికి వెళ్లి వస్తున్న సమయంలో భక్తులు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. 65వ జాతీయ రహదారిపై జహీరాబాద్ బైపాస్ రోడ్డులో కారు అదుపు తప్పి కల్వర్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా.. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. శనివారం తెల్లవారుజామున 4.30 గంటలకు ఈ ఘటన చోటు చేసుకుంది. వీరంతా హైదరాబాద్‌కు చెందిన వారు. జహీరాబాద్ పట్టణ ఎస్ఐ. కాశీనాథ్ కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని కుత్బుల్లాపూర్‌కు చెందిన సురేష్, శివకుమార్, నర్సింహరావు అతని కుమారుడు మనోజ్‌లు కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని కర్నాటక రాష్ట్రంలోని ఘనగాపూర్‌లో గల శ్రీదత్తాత్రేయస్వామిని దర్శించుకునేందుకు శుక్రవారం టీఎస్08 హెచ్ఎం0220 నంబర్ గల ఆల్టో కారులో వెళ్లారు. ఘనగాపూర్‌లో స్వామి వారిని దర్శించుకుని తిరిగి వస్తున్న సమయంలో డ్రైవర్‌కు నిద్రమత్తు రావడంతో కారుపై నియంత్రణ కోల్పోయాడు. 65 జాతీయ రహదారిపై పట్టణంలోని బైపాస్‌రోడ్డులో ఇంద్రప్రస్థా కాలనీ వద్ద వేగంగా వెళ్లి కారు కల్వర్టుకు ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో సురేష్(25) అక్కడికక్కడే మృతి చెందాడు.



శివకుమార్, చికిత్స పొందుతున్న మనోజ్

విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటినా గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో జహీరాబాద్‌లోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా నర్సింహరావు(42) మృతి చెందారు. శివకుమార్, మనోజ్‌లకు తీవ్రగాయాలు కావడంతో స్థానికంగా చికిత్స అందించిన తరువాత మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

చెడు వ్యసనాలు.. ముగ్గురు విద్యార్థులు అదృశ్యం


మనోజ్ కుమార్


అఖిల్


మల్లికార్జున్

జిన్నారం (పటాన్‌చెరు): చెడు వ్యసనాలకు బానిసలైన ముగ్గురు విద్యార్థులు అదృశ్యమయ్యారు. ఈ సంఘటన శనివారం బొల్లారంలో చోటుచేసుకుంది. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక ఆదర్శ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న మనోజ్ కుమార్, అఖిల్, మల్లికార్జున్ మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో పాఠశాల గోడదూకి పారిపోయారు. ఈనెల 14వ తేదీన పాఠశాలలో బాలల దినోత్సవం జరుగుతున్న సందర్భంలో వీరు భవనం పైకి వెళ్లి సిగరెట్లు తాగారు. విషయం తెలుసుకున్న ప్రిన్సిపాల్ శ్రీదేవి మందలించి వదిలేశారు. మరుసటి రోజు తల్లిదండ్రులకు విద్యార్థుల ప్రవర్తనపై ఫిర్యాదు చేశారు. పాఠశాలకు వచ్చిన తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీదేవి సరిగ్గా ఒంటిగంట సమయంలో ముగ్గురు విద్యార్థులు పాఠశాల గోడ దూకి పారిపోయారు. వెంటనే ప్రిన్సిపాల్ సీఐ గంగాధర్‌కు ఫిర్యాదు చేశారు. ఇద్దరు కలిసి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. చెడు వ్యసనాలకు బానిసలైన విద్యార్థులపై తల్లిదండ్రులు జాగ్రత్తలు వహించాల్సిన బాధ్యత ఉందన్నారు. పారిపోయిన విద్యార్థులు ఎవరికైనా కనబడితే 8712656729, 8712661841 నంబర్లకు ఫోన్ చేసి పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సీఐ సూచించారు.

హైవేపై దూసుకొచ్చిన మృత్యువు

- రోడ్డు దాటుతున్న మహిళను ఢీకొన్న కారు
- అక్కడికక్కడే మృతి


సత్యమ్మ(ఫైల్)

టేక్మాల్(మెదక్): రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. ఈ సంఘటన టేక్మాల్ మండలం బొడ్మట్‌పల్లి వద్ద 161 సంగారెడ్డి-నాందెడ్ అకోలా రహదారిపై శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. బొడ్మట్‌పల్లికి చెందిన భవానీ సత్యమ్మ(35) వ్యవసాయ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తోంది. ఎప్పటిలాగే కూలి పనులకు వెళ్లి పనులు ముగించుకొని ఇంటికి వస్తుండగా రోడ్డు దాటుతోంది. ఇదే సమయంలో సంగారెడ్డి నుంచి నారాయణఖేడ్ వైపు వెళుతున్న గుర్తు తెలియని కారు వేగంతో వచ్చి సత్యమ్మను బలంగా ఢీకొట్టింది. సత్యమ్మకు తలకు, ముక్కుకు బలంగా గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఎస్ఐ రాజేష్ సంఘటన స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గ్రామస్తుల ధర్నా

161హైవే అధికారులు రోడ్డుపై విద్యుత్ బల్బులు ఏర్పాటు చేయకపోవడంతో ఎంతోమంది ప్రాణాలు పోతున్నాయని గ్రామస్తులు ధర్నా చేశారు. హైవే అధికారులు విద్యుత్ బల్బులు, అండర్‌పాస్ బ్రిడ్జి ఏర్పాటు చేస్తామని చెబుతూ నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. అల్లాదుర్గం సీఐ రేణుక హైవే అధికారులతో మాట్లాడి బల్బులు ఏర్పాటు చేయిస్తానని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

ఆర్థిక ఇబ్బందులతో మహిళ ఆత్మహత్య

సిద్దిపేటరూరల్: ఆర్థిక ఇబ్బందులతో ఓ మహిళ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన నారాయణరావుపేట మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ అపూర్వరెడ్డి వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కొమిరే కళవ్వ (51) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తుంది. భర్త చనిపోవడంతో కుటుంబ పోషణతో పాటుగా ఇటీవల కొడుకుకు పెళ్లి చేసి అప్పుల పాలైంది. కొద్ది రోజులుగా ఆర్థికంగా ఇబ్బంది పడుతోంది. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన కళవ్వ శుక్రవారం రాత్రి ఇంట్లో వారికి చెప్పకుండా బయటికి వెళ్లింది. రాత్రి 9 అయినప్పటికి ఇంటికి రాలేదు. ఆమె ఆచూకి కోసం గాలించగా.. ఇంటికి సమీపంలో ఉన్న బావి వద్ద చెప్పులు కనిపించడంతో బావిలో చూడగా.. అప్పటికే కళవ్వ బావిలో తేలాడుతుంది. కేసు దర్యాప్తులో ఉంది.

ట్రాక్టర్ పైనుంచి పడి రైతు మృతి

ధాన్యం అమ్ముకొని వస్తుండగా ప్రమాదం

పెద్దశంకరంపేట(మెదక్): ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌పై నుంచి ఓ రైతు మృతి చెందాడు. ఈ సంఘటన పెద్దశంకరంపేట మండల పరిధిలోని శివాయిపల్లి వద్ద శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ముసాపేటకు చెందిన కుర్మగొల్ల బీరప్ప(43) స్నేహితుడు దేవయ్య, ట్రాక్టర్ డ్రైవర్ గోసాయిపల్లి వీరయ్యతో కలిసి ధాన్యాన్ని అమ్ముకునేందుకు శుక్రవారం ఉత్తులూర్ వద్ద ఉన్న రైస్‌మిల్లుకు వెళ్లారు. తిరిగి వస్తుండగా ట్రాక్టర్‌పై నుంచి కింద పడడంతో తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా, డ్రైవర్ మద్యం మత్తులో ఉండి అతివేగంగా ట్రాక్టర్ నడపడంతో పట్టుతప్పి పడిపోయాడని చెబుతున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శంకర్ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



పటాన్‌చెరు టౌన్: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ సురేందర్ రెడ్డి కథనం .. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లోని మహదేవ మొబైల్ షాప్ పక్కన ఖాళీ స్థలంలో శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కనిపించింది. అతని వయస్సు 45 నుంచి 50 సంవత్సరాల మధ్య ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి సంబంధించిన బంధువులు ఉంటే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పటాన్‌చెరు పోలీసులు చెప్పారు.

ధాన్యాన్ని వెంటనే దింపుకోవాలి

విజిలెన్స్ అడిషనల్ ఎస్పీ ద్రోణాచార్యులు


ఎల్లాపూర్ మిల్లును తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అడిషనల్ ఎస్పీ ద్రోణా చార్యులు

పాపన్నపేట(మెదక్): రైసు మిల్లులకు వచ్చే ధాన్యాన్ని వెంటనే దింపుకోవాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ అడిషనల్ ఎస్పీ ద్రోణాచార్యులు అన్నారు. శనివారం మండల పరిధిలోని ఎల్లాపూర్ రైసు మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు వచ్చే ధాన్యాన్ని వెంటనే దింపుకోవాలని సూచించారు. అందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాల్సిన బాధ్యత మిల్లు యజమానులదేనని చెప్పారు. లారీలు సకాలంలో ఖాళీ చేసుకోక పోతే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అక్రమాలు బయటపెడుతున్నారనే..

- హత్యాయత్నం కేసులో ఆరుగురు నిందితుల రిమాండ్
- గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి వెల్లడి

తొగుట(దుబ్బాక): మండలంలోని లక్ష్మాపూర్‌కు చెందిన పిట్ల రాజు (30)పై హత్యాయత్నానికి పాల్పడిన నిందితులను శనివారం ఆరుగురు నిందితులను అరెస్టు చేశామని గజ్వేల్ ఏసీపీ పురుషోత్తం రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. మల్లన్న సాగర్ నిర్వాసిత గ్రామం లక్ష్మీపూర్‌కు చెందిన ఇద్దరు మాజీ సర్పంచ్‌లు పిట్ల శ్రీనివాస్, మల్‌చెల్మ స్వామిల మధ్య నెలకొన్న తగాదా హత్యాయత్నానికి దారితీసిందన్నారు. మాజీ సర్పంచ్ స్వామి, మాజీ వార్డు సభ్యుడు కనకరాజు మల్లన్న సాగర్‌లో భూసేకరణ సమయంలో అక్రమాలకు పాల్పడ్డారని, అలాగే గజ్వేల్ ఆర్అండ్ఆర్ కాలనీలో దేవాలయ నిర్మాణంలో అక్రమాలకు పాల్పడుతున్నారంటూ పిట్ల రాజు తరచూగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడు. ఈ క్రమంలో అక్రమాలను ప్రశ్నిస్తున్న రాజును ఎలాగైనా అడ్డు తొలగించాలని మాజీ సర్పంచ్ స్వామి, ఆయన తమ్ముడు కరుణాకర్, మాజీ వార్డు సభ్యుడు కనకరాజు కుట్ర పన్నారని తెలిపారు. ఇందులో భాగంగా రాజును హత్య చేయించేందుకు రూ.50వేలకు తుక్కాపూర్‌కు చెందిన గండ్యాల నగేష్ అలియాస్ డాన్‌తో ఒప్పందం చేసుకున్నారు. కాగా నగేష్ రాంపురానికి చెందిన జె.భిక్షపతితో రాజును హత్య విషయమై చర్చించారు. ఈ నెల 10న సాయంత్రం తొగుట వైన్స్ సమీపంలో వీరు మద్యం తాగించి రాజును హత్య చేసేందుకు పథకం రచించారు. దీంతో కడారి సాగర్, మల్లుగారి గణేష్, ఎండీ ఫిరోజ్‌తో పాటు ఇద్దరు మైనర్లు 11వ తేదీన సాయంత్రం రాజు వ్యవసాయ బావి వద్ద ఉన్న సమయంలో రెండు ద్విచక్ర వాహనాలపై వెళ్లి బీరు సీసాలు, రాళ్లతో దాడి చేశారు. దాడిలో రాజు తీవ్ర గాయాలతో స్పృహతప్పి పడిపోయాడు. రాజు మరణించాడని నిర్ధారించుకున్న తర్వాత అక్కడి నుంచి పరారయ్యారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు రాజును చికిత్స కోసం కుటుంబీకులు సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాజు తండ్రి పిట్ల శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏసీపీ తెలిపారు. కాగా ఈ దాడిలో పాల్గొన్న ఆరుగురు నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు. మాజీ సర్పంచ్ కొల్చెల్మ స్వామి, అతని తమ్ముడు కరుణాకర్, కనకరాజు, భిక్షపతి పరారీలో ఉన్నారని తెలిపారు.

మల్లన్న మన్నించు

స్వామివారి పుష్కరిణి చుట్టూ మురుగు


స్వామి వారి పుష్కరిణి చుట్టూ మురుగు


మురుగులో నుంచి నడుస్తున్న భక్తులు

మల్లికార్జున స్వామి ఆలయ పరిసరాల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. ప్రైవేటు అద్దె గదులు, దుకాణాల సముదాయాల నుంచి వచ్చే డ్రైనేజీ పైపులు పగిలి స్వామి పుష్కరిణి (ధర్మగుండం) చుట్టూ మురుగు నీరు పేరుకుపోయింది. నిత్యం వేలాది మంది భక్తులు స్వామి వారి దర్శనానికి వస్తారు. వారు పుష్కరిణిలో పుణ్య స్నానం చేసి ఈ మురుగు నీటిలో నుంచే నడిచి వెళ్తున్నారు. ఇప్పటికైనా ఆలయ అధికారులు, గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

– కొమురవెల్లి(సిద్దిపేట):